*ప్రశంసలకు లొంగని వాళ్ళుండరు. ప్రశంసలకు తగిన అర్హత అందుకుంటున్న వాళ్ళకు లేకపోతే, ఆ ప్రశంసలు యిస్తున్నవాళ్ళకేదో కారణం వుండాలి కదా!*

నా స్నేహితురాలు రామావతి చాలా తెలివైనది. చిన్నప్పట్నించి దానికి మన స్తత్వ పరిశీలనంటే యిష్టం. ఎటొచ్చీ దాన్లో ఓ పెద్ద లోపముంది. అదెప్పుడూ ఏం చేయాలీ అన్న విషయంలో నిర్ణయం తీసుకోదు. ఏం చేయకూడదూ అన్నదే దానికి ముఖ్యం.

ఇది ప్రగతిపథంలో నడిచేవాళ్ళ పద్ధతి కాదని దానికి చాలాసార్లు చెప్పాను. అది నా మాటల్ని బొత్తిగా లక్ష్యపెట్టేది కాదు—'నిజం చెప్పడం కంటె అబద్ధం చెప్పడం కష్టం. ఏం చేయాలో తేల్చుకోవడంకంటె ఏం చేయకూడదో తేల్చుకోవడం కష్టం. అనుభవంమీద నీకే తెలుస్తుంది—' అనేది.

# శ్యామల కథ

రామావతిదీ నాదీ ఒకటే వయసు. ఏ విధంగా దాని అనుభవమెక్కువో నాకు అర్థంకాలేదు. అప్పుడు రామావతికి మాక్లాస్ మేట్ సుశీలను ఉదాహరణగా యిచ్చింది. సుశీలకు ఒకే పాఠం పదిసార్లు చదివినా అర్థంకాదు. ఒక్కసారి చదివితే మా కందరికీ అర్థమైపోతుంది.

"అనుభవమంటే పదిసార్లు చదవడం కాదు. చూసినదీ, చదివినదీ వంటబట్టించుకోవడం. వాటినుంచి కొత్త విషయాలు నేర్చుకోవడం—" అంది రామావతి. నేనింక మాట్లాడలేదు.

మా యిద్దరికీ పెళ్ళిళ్ళై విడివిడిగా వెళ్ళిపోయినా మేమిద్దరం ఉత్తరాలు రాసుకుంటూనే వుండేవాళ్ళం. ఇటీవలే మాకు కాకినాడ ట్రాన్స్ఫరయింది. ముందు శ్రీవారు వెళ్ళి ఇల్లు చూసుకువచ్చారు. సూర్యారావుపేట లచ్చిరాజువారి వీధిలో ఇల్లు దొరికింది మాకు.

ఆ అడ్రసు చూడగానే రామావతి నా బుర్రలో తళుక్కుమంది. ఏడాది క్రితం దాకా రామావతి అక్కడే వుండేది. మరి కొంతకాలం అదక్కడే వుండివుంటే మేం మళ్ళీ కలిసి కాలం గడిపేవాళ్ళం. కానీ వాళ్ళాయనకు ట్రాన్స్ఫరై అది హైదరాబాదు వెళ్ళిపోయింది.

నేనెప్పుడూ కాకినాడ చూడలేదు. ఊరు చాలా శుభ్రంగా ఉంటుందనీ— అన్ని సదుపాయాలూ బాగుంటాయనీ, అన్నీ చౌకఅనీ విన్నాను. ముఖ్యంగా మా యింటికి సినిమా టాకీసులన్నీ దగ్గిరట. కాకినాడలో ఇంచుమించు అన్ని సినిమాహాళ్ళూ ఒకే వీధిలో ఉంటాయట. నా సినిమాపిచ్చికిది బాగానే ఉంది.

రామావతికి ట్రాన్స్ఫర్ గురించి ఉత్తరం రాశాను.

తిరుగుటపాలో జవాబు వచ్చింది. అందులో రామావతి ఒక ముఖ్యమైనసలహా యిచ్చింది. అసలా సలహా యివ్వడం కోసమే ఆ ఉత్తరం అంత అర్జంటుగా రాసింది.

తనూ ఆ వీధిలోనే వుండేది కాబట్టి ఈ ముఖ్యమైన విషయం రాస్తోందిట. ఆవీధిలో వుండే శ్యామల అనే ఆమెతో స్నేహం చేయకూడదట. ఆమెకు సాధ్యమైనంత దూరంగా వుండాలిట.

రామావతి ఉత్తరం చదువుతూంటె ఆ శ్యామల యెవరో భయంకర రాక్షసి అయుండాలని పించింది. ఆమె యెవరో ఆమెతో యెందుకు స్నేహం చేయకూడదో ఆమె నుంచి యెందుకు దూరంగా వుండాలో రాయలేదు. రామావతి ఏం చేయాలో చెబుతుంది కానీ యెందుకు చేయాలో చెప్పదు. అది నాయకత్వపు లక్షణమని నాన్నగారూ, శ్రీవారూ కూడా అంటారు. మా కాలేజీలో అది నాయకురాలిగానే వుండేది మరి!

మేము కాకినాడవెళ్ళి ఇంట్లో దిగిన మరుక్షణంనుంచే నాకు శ్యామల పట్ల పెద్దగా కుతూహలం బయల్దేరింది. ఆమె ఎవరో ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్నది నా తాపత్రయం.

మొదటిరోజు రాత్రి వీధిలో ఏవో పెద్ద



కేకలూ, పెడబబ్బొలూ వినిపిస్తే—శ్యామల అనే బ్రహ్మరాక్షసి తిరుగుతుందేమోనని అనుమానించాను. కానీ అది ఎవడో త్రాగుబోతు అల్లరి అని తర్వాత తెలిసింది.

మర్నాడే నాకు శ్యామల దర్శనమూ అయింది. ఆమే నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

ఇలా శ్రీవారు ఆఫీసుకు వెళ్ళగానే అల్లా వచ్చేసిందామె. అదృష్టవశాత్తూ బాబు అప్పటికే నిద్రపోయాడు. నేను ఖాళీగా ఉన్నాననే చెప్పాలి.

"నమస్కారమండీ !" అన్నదామె ఎంతో చక్కగా.

"నమస్కారం—" అంటూ ఆమెను చూశాను.

"నా పేరు శ్యామల !" అందామె.

ఉలిక్కిపడ్డాను. అప్పటివరకూ నాచేతిలో ఓ వస్తువున్నదని కూడా నాకు తెలియదు. దువ్వెన జారి క్రిందపడగానే — శ్యామల రెండడుగులు ముందుకువేసి దువ్వెన తీసి అందించింది. నేను చటుక్కున సర్దుకుని— "రామలక్ష్మి నా పేరు !" అన్నాను.

## 'వసుంధర'

"చక్కటి పేరు —" అందామె — "ఈ పేరులో చాలా మంది రచయిత్రులున్నారు. మీరూ రచయిత్రియేనా ?"

"ఏం రచనల్లెండి — ఆడాళ్ళ కథలు రాస్తుంటే ఆడాళ్ళు, మగాళ్ళు కూడా వేళాకోళం చేస్తున్నారు—" అన్నాను విషయం దాటవేస్తూ.

నా ఆలోచనలు రకరకాలుగా పరుగెడుతున్నాయి. శ్యామల బ్రహ్మ రాక్షసిలాలేదు కుందనపు బొమ్మలా గున్నది. మాట్లాడుతూంటే వీణ మీటినట్లున్నది. మాట్లాడే తీరులో వినయం వుట్టిపడుతోంది.

రామావతి ఈమెగురించి యెందుకలా రాసింది ? ఒకవేళ శ్యామలబుద్ధి మంచిది కాదా ? ఆమె తన సౌందర్యంతో, తళుకు బెళుకులతో మగవాళ్ళను వలలో వేసుకుంటుందా ?

మళ్ళీ నాకు భయంవేసి మరోసారి చేతిలోంచి దువ్వెన జారిపోయింది. ఏమో— రామావతి యెందుకు రాసిందో యెలాగైనా ఈమెను వెంటనే వదుల్చుకోవాలి !

శ్యామల ప్రశ్నలు మొదలు పెట్టింది. "మీ వారేం చేస్తుంటారు, ఈ ఊళ్ళో యెంతకాల ముంటారు. వగైరాలు అడిగిందామె. మొదటిసారి కలుసుకున్నప్పుడలాంటి ప్రశ్న లడగడం ఆడవారికి సహజమే ! కానీ నాకుమాత్రం రామావతి హెచ్చరిక కారణంగా ఆమె నా భర్త పైనే ఆసక్తి చూపిస్తున్న దనిపించింది. భయపడుతూనే సమాధానాలు చెప్పాను.



తర్వాత శ్యామల మా పెళ్ళి ఫొటోల గురించి అడిగింది.

అర్థమై పోయింది. మావారెలాగున్నారో చూడాలను కుంటోందన్నమాట.

ఎలాగో అలా ఆమెను తొందరగా వదుల్చుకోవాలనుకుని లోపలి గదిలోకి వెళ్ళాను. అక్కడ ఫొటో ఆల్బం వుంది. బాబు కూడా ఆ గదిలోనే పడుకున్నాడు. సాధారణంగా వాడు పడుకుంటే నాకెంతో హాయిగా వుంటుంది. వాడు మెలకువగా వుంటే ఒక్కపనీ అవదు. అసలు చంక దిగడువాడు. ఆయనుండగా, వాణ్ణాయన కప్పగించి పనులు చేసుకుంటాను.

ఇప్పుడు శ్యామలను వదిలించుకునేందుకు వీడే మార్గమనిపించింది. చటుక్కున ఉయ్యాల్లో చేయిపెట్టి గట్టిగానే గిచ్చాను. సాధారణంగా వాడు చీమ చిటుక్కుమన్నా లేచిపోతాడు. ఈ రోజు యెందువల్లనో నేను గిచ్చినా వులకలేదు, పలకలేదు. భయం



కూడా వేసింది. కానీ వాడికి యేమీ కాలేదు. హాయిగా నిద్రపోతున్నాడు అంతే!

ఆ విషయం రూఢి చేసుకోవాలని మరో సారి గిచ్చబోయాను. ఈలోగా గదిలో అడుగులచప్పుడు వినబడింది. శ్యామల అక్కడికి వచ్చేసింది.

'బాబు కదిలినట్లయితే వూపుతున్నాను..' అంటూ సంజాయిషీయిచ్చి గూడుదగ్గరకు వెళ్ళాను. గూట్లోవుంది ఆల్బం. ఆల్బం పక్కనే స్టీలుగ్లాసు కూడా వుంది. ఆల్బం తీస్తూ స్టీలుగ్లాసు క్రిందపడేశాను— ఏదో పొరపాటున పడినట్లుగా ఉండాలని! ఆ చప్పుడుకు బాబు లేస్తాడని ఆశ....

అయితే చప్పుడు కాలేదు. నా వెనుకనే వస్తున్న శ్యామల గ్లాసును క్రిందపడకుండా ఆపి—"ఈ రోజు మీ చేయి వదులుగా ఉన్నట్లుందే...." అంది.

ఇబ్బందిగా నవ్వి—ఆల్బం ఆమె చేతిలో పెట్టాను.

"మీ ఫొటోలు నాకేం తెలుస్తాయి— మీరే చెప్పాలి—" అంది శ్యామల.

"దానికేముంది? వీటి సంగతి అడిగే వాళ్ళే ఉండరు...." అంటూ అక్కడే కూర్చోబోయాను.

"ఇక్కడొద్దండీ — బాబు నిద్రలేచి పోతాడు. హాల్లోకిపోదాం" అందామె.

ఆమె అలా అనగానే నాకు పట్టుదల వచ్చింది — "ఫరవాలేదండీ — వాడిది మొద్దునిద్ర...." అంటూ అక్కడే చతికిల బడ్డాను. ఏమనుకుందో తనూ అక్కడే కూర్చుంది శ్యామల.

ఆమెకు ఒకో ఫొటో గురించీ వీలైనంత గట్టిగా చెప్పసాగాను. నా కంఠ శోషగానీ బాబు మాత్రం లేవడంలేదు. శ్యామల ఏదైనా మంత్రం వేసిందో ఏమిటో వాడు కదలను కూడా కదలడంలేదు.

"మీ వోపికను మెచ్చుకోవాలి. చక్కగా వివరించి చెబుతున్నారు. నేను వినగలను కానీ వివరించలేను" అంది శ్యామల. నన్ను మెచ్చుకోవడమయ్యేక ఆమె శ్రీవారి అందాన్నికూడా మెచ్చుకున్నది అది నాకు నచ్చలేదు.

శ్యామల నన్నుగురించి వొక్కొక్కటే వివరాలడిగి తెలుసుకుంటోంది. నేను చెబుతున్నాను.

నాది కాస్త ముభావమైన స్వభావం. ఎదుటివారి నాట్టే ప్రశ్నలు వెయ్యకుండా అడిగిందానికి చెప్పడం నా అలవాటు.

శ్యామల అడిగేస్తోంది. నేను చెప్పేస్తున్నాను.

"నేను చాలా అదృష్టవంతురాలిని. నా అదృష్టంకొద్దీ మీరీ వీధిలోకి వచ్చారు. మీకు కుట్లు, అల్లికలు వచ్చు, వీణ వచ్చు, వంట బాగా చేయడం వచ్చు ఇల్లుశుభ్రంగా ఉంచుకోవడంవచ్చు. మీ నుంచి నేనుఎన్నో నేర్చుకోవచ్చు. ఇలాంటి అవకాశం కోసమే నేనూ ఎదురు చూస్తున్నాను...." అంది శ్యామల.

వెంటనే శ్యామల నాకు నచ్చేసింది. ఎవర్ని వారే పొగుడుకునే ఈ రోజుల్లో యెదుటివాళ్ళ పొగడ్తలందుకోవడం అదృష్టం! ఆ అదృష్టం శ్యామలవంటివారి పరిచయం వల్లనే కలగాలి. మరి రామావతి

రామావతి ఉత్తరం గుర్తురాగానే మళ్ళీ శ్యామల అంటే భయం వేసింది.

"ఈ రోజు సాయంత్రం మీరూ, మీ వారూ మా యింటికి రావాలి. కాదన కూడదు" అంది శ్యామల.

అప్పుడు గుర్తుకొచ్చింది నాకు — నేను శ్యామల గురించి ఏమీ తెలుసుకోలేదని. ఆమె అడుగుతూంటే నా గురించి చెప్పుకు పోతున్నాను తప్పితే మాటపరుసకు కూడా ఆమె గురించి ఒక్క ప్రశ్న వేయలేదు.

"నన్ను గురించి అడగడమే కానీ మీ గురించి ఏమీ చెప్పలేదు" అన్నాను.

"చెప్పడానికి నా గురించి ఏముందిలెండి పెళ్లై నాలుగేళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఆయన మందుల కంపెనీలో సేల్సు రిప్రజెంటేటివ్. పట్టుమని నెలకు వారం రోజులు కూడా ఇంటిపట్టున ఉండరు. ఉండిమాత్రం ఆయనకు సుఖమేమిటిలెండి—నాకు ఒక్కపనీరాదు.ఇల్లు సర్దుకోవడం రాదు. చిన్నప్పట్నించీ గారంగా పెంచి అమ్మా నాన్నా నన్నో బద్ధకస్తురాల్ని చేశారు. పిల్లల్ని ఆయా చూసుకుంటుంది. నేనిలా ఆ యింటా ఈయింటా తిరుగుతాను—" అంది శ్యామల.

శ్యామల మాటలు వినగానే నాకింకా భయం వేసింది. భర్త ఇంటిపట్టున ఉండదంటోంది. నెలకు వారంరోజులు మాత్రమే ఇంట్లోఉండే భర్త-అద్భుతమైన సౌందర్యం ఈమెను తప్పుదారిన నడిపించడానికి సహకరిస్తున్నాయా? ఇంతకీ ఈ రోజు భర్త యింట్లో వున్నాడా?

అడిగితే లేదని చెప్పిందామె.

"ఆయనొచ్చేక వస్తాంలెండి!" అన్నాను.

"అవున్లెండి మీలాంటివాళ్ళు నాలాంటి దాని ఆహ్వానాన్నెందుకు మన్నిస్తారు?" అన్నదామె.

"అదేమిటండీ— అలాగనేశారు...." అన్నాను నొచ్చుకుంటూ. వెంటనే ఆమె ఆహ్వానానికి అంగీకరించాను కూడా.

ఆమె సంతోషంగా వెళ్ళిపోయినాకే బాబు లేచాడు....

ఆయన సాయంత్రం వస్తూనే—"టిఫినేం చేశావోయ్—" అనడిగారు.

"ఈ రోజు టిఫిన్ లేదు. శ్యామల ఆహ్వానించింది—" అన్నాను.

"మీ ఫ్రెండు రాసిందన్నావు—ఆ శ్యామలేనా—వాళ్ళింటికెందుకోయ్—"అన్నారాయన విసుగ్గా.

ఉదయం జరిగిందంతా చెప్పి బాగుందన్నాను. ఏమనుకున్నారో ఆయన వొప్పుకున్నారు. సాయంత్రం వాళ్ళింటికివెళ్ళాం. వాళ్ళిల్లు చూసి నేనెంతో ఆశ్చర్యపోయాను. ఇల్లంతా తీర్చి దిద్దినట్లుంది. పిల్లలిద్దరూ క్రమశిక్షణ బాగా పాటిస్తున్నారు. ఆమె చనువుగా ఆయన్ను కూడా పలకరించింది. అయితే నాకు తృప్తి కలిగేలాగా అన్నయ్యగారూ అని పిలిచిందాయన్ను.

"మిమ్మల్నింటికి పిలిచి హోటల్నుంచి టిఫిన్ తెప్పించడం భావ్యంకాదు. అందుకని చేతకాకపోయినా ఏదో చేశాను. నా

తృప్తికోసం మీరు తినాలి...." అంది శ్యామల.

నేను నవ్వి — "మీరలాగంటారు మీకు అన్నీ వచ్చు...." అన్నాను.

"నిజంగా నాకు వంటరాదు. అస్తమానూ టూర్లలో వుండడం తన అదృష్టమని ఆయనంటూంటారు. ఇప్పుడు పకోడీలు ప్రారంభించి ఓ పెద్ద డౌటు వచ్చి ఆగిపోయాను. పిండి కలిపాను. అందులో నూనె వేస్తారో వేయరోనని అనుమానం వచ్చింది" అందామె.

ఆయన చటుక్కున కలగజేసుకుని — "పిండిలో నూనె వేస్తారోలేదో తెలియదు కానీ — నూనెలో పిండి వేస్తారని నాకు తెలుసునండి" అన్నారు.

శ్యామలకదిచురుక్కుమన్నట్లుంది. ఒక్క నిముషం మాట్లాడలేదు. ఆయనలా జోక్ చేసినందుకు నేను మాత్రం కాస్త నొచ్చుకున్నాను. కానీ అదాయన స్వభావం.

తర్వాత శ్యామల పకోడీలు వేసింది. వాటి రుచి అద్భుతం. అదేమాట నేనంటే— "మొహమాటపడ్డవాళ్ళ నెందర్నో చూశాను గానీ మీ అంత మొహమాటస్తుల్ని చూడలేదు" అనేసిందామె. ఆమె పకోడీల పిండి ఎలా తయారుచేసిందో తెలుసుకోవాలని ప్రయత్నించాను...." తిన్నది చాల్లెండి. అదే నాకు పదివేలు. మీ చేత ఇలాంటి వంటకం తినిపిస్తున్నందుకు సిగ్గుతో చచ్చిపోతున్న నేను ఇంకా అ వెలా చేశానో కూడా చెప్పాలా ?" అందామె.

శ్యామలకు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉన్నదేమోనని నాకు అనుమానంవచ్చింది. వాళ్ళింటి నుంచి తిరిగి వెళ్ళేక ఆయనతో అదేమాట అన్నాను.

"ఆడతనమే ఓ పెద్ద కాంప్లెక్సు...." అని ఊరుకున్నారాయన.

మర్నాడు కూడా శ్యామల ఆయనిలా ఆఫీసుకు వెళ్ళగానే మా యింటికొచ్చేసింది. కుట్లు అల్లికలు నేర్పమని కూర్చుంది. నా దురదృష్టంకొద్దీ ఆమె వున్నంతసేపూ బాబు నిద్రలేవలేదు. భయపడవలసిందేమీ కనిపించకపోయినా రామావతి ఉత్తరం నా మనసులో బెరుకును సృష్టిస్తూనే ఉంది.

నాకు తోచినవి ఏవోచెప్పి— "మీరసలు ఎలాంటి చీరకట్టినా బాగానే ఉంటారు. మీకు చీరలమీద వేరే ఎంబ్రాయిడరీలు అవసరంలేదు—" అన్నాను.

"ఆహా— ఆ మాట మీరనాలి. నా రంగు మీ అంత వచ్చగా మారనిండి అప్పుడు నిజంగా మీ మాటలు ఒప్పుకుంటాను—" అంది శ్యామల.

నా మనసు చివుక్కుమంది. నేను నలుపు కాదుకానీ శ్యామలంత వచ్చగా ఉండను. ఆమె అలా అనగానే నా రంగును వెటకారం చేసినట్లు అనిపించింది. అయితే నేనెంత వాదించినా శ్యామల ఒప్పుకోలేదు. నాతో పోలిస్తే తను కాకికంటే నలుపు అని వాదిస్తూ కూర్చుంది. అప్పుడు నాకూ అది నిజమేనేమోనని అనుమానం కలిగింది.

మర్నాడు శ్యామల సంగీతం గురించి అడిగింది. నేనేదో కొంత నేర్చుకున్నాను. తనకేమైనా వచ్చునేమోనని అడిగాను.


"సప్తస్వరాలంటే ఏడు గదా—సరిగమ లంటే నాలుగు స్వరాలేకదా — మిగతా మూడూ ఏమిటని ఎందర్నో అడిగి నవ్వుల పాలయ్యాను. అదీ నా సంగీత పరిజ్ఞానం.." అని నవ్వింది శ్యామల. ఆమె బలవంతం మీద నేను రెండు కృతులు పాడాను. ఆమె నన్ను విపరీతంగా పొగిడిపారేసి — "ఇక ముందు బాత్రూంలో పాడుకుందుకు కూడా భయపడాలి నేను" అంది.

రోజూ శ్యామల వచ్చి నన్ను పొగిడి వెళ్ళిపోతోంది. ఆమె పొగడ్తలు వింటూంటె నాకు నా అంతటిది లేదనిపించింది. మొహమాటానికి ఆమెనూ పొగుడుతూండే దాన్ని కానీ ఆమె మాటలు మరీ మరీ వినాలని వుండేది.

శ్యామల నన్నెలా పొగుడుతుందో ఆయనకు చెబితే "నువ్వు కాస్త జాగ్రత్తగా వుండు. కొన్నేళ్ళుగా నీతో కాపురం చేస్తున్నాను. ఆమెకంటె నీ గురించి నాకే బాగా తెలుసు. నువ్వు ఆమె పొగిడినంత గొప్పదానివికావు" అని హెచ్చరించారు. అలా హెచ్చరించినందుకు నాకు ఆయనమీదే కోపం వచ్చింది.

## మేధావులు

చిలుంపట్టిన తాళంకప్ప
చిల్లుపడిన తెప్ప



బండకింద మండ్రగప్ప
దేశంలో మేధావులకు తప్ప

—ఎండ్లూరి సుధాకర్

ఇలా యెంతకాలం సాగేదో తెలియదు కానీ వొకరోజు చెప్పకుండా చెయ్యకుండా రామావతి మా యింటికి వూడిపడింది. ఆ సమయంలో నేనూ శ్యామలా కబుర్లు చెప్పుకుంటున్నాం. రామావతిని చూసి శ్యామల ఏమనుకుందో— వస్తానని నాతో చెప్పి వెంటనే వెళ్ళిపోయింది.

రామావతి నావంక అదోలాచూసి— "అయితే శ్యామల స్నేహం చేస్తున్నావన్న మాట !" అంది. చెడు స్నేహాలు చేసే కుర్రాణ్ణి తల్లి అదిలించినట్లు అది అంటే నాకుక్రోషం కలిగి— "ఏం—ఏమయింది ? ఆమె నాకు మంచిదిగానే కనబడింది—" అన్నాను.

"అలాగా—" అని రామావతి నవ్వి— "ఆమె నిన్ను అదేపనిగా పొగిడితే అయిపైపోతున్నావా, నేనూ అలాగే అయిపోయాను" అంది.

నేను కాస్త ఆశ్చర్యపడి— "ఆమె అలా పొగిడితే మనకేం నష్టం ?" అన్నాను.

"చెప్పనా ?" అంది రామావతి:

అప్పుడే బాబులేచి క్యారు మన్నాడు. వాణ్ణి సముదాయించడం కష్టమయింది. రామావతి వాణ్ణి యెత్తుకుంది. ఇట్టే వూరుకున్నాడు వాడు. అప్పుడది తన మాటలు కొనసాగించింది.

"చూడు....ఇందిరాగాంధీ నీ దగ్గరకొచ్చి ప్రజల్లో నీకున్న పలుకుబడికి అసూయ పడితే నీ కెలా గుంటుంది ?"

నేను మాట్లాడలేదు.

"అలాగే ఎం.ఎస్. సుబ్బులక్ష్మి వచ్చి నీ సంగీత సామర్థ్యాన్ని చూసి అసూయపడితే నీకెలా గుంటుంది ? ఏ శ్రీదేవో వచ్చి నీ అందానికి అసూయపడితే ఎలాగుంటుంది?"

"ఇవన్నీ ఎందుకడుగుతున్నావు ?"

"శ్యామల సర్వసమర్థురాలు. ఆమెకు రాని విద్య లేదు. అన్ని విద్యల్లోనూ ఆమె ఆరితేరింది. వంటలో, కుట్టుపనుల్లో, అందంలో, ఇల్లు తీర్చిదిద్దడంలో, భర్త మనసుకు తృప్తిని కలిగించడంలో, పిల్లల్ని క్రమశిక్షణలో పెంచడంలో, చక్కగా మాట్లాడడంలో ఆమెకు ఆమేసాటి. అయితే ఆమె మనస్తత్వంలో చిన్న లోపముంది. ఆమె యెదుటివాళ్ళ దగ్గర తన గురించి ఏమీ చెప్పుకోకుండా వాళ్ళను తను విపరీతంగా పొగిడి పారేస్తుంది. అలా వాళ్ళను కొంతకాలం చెట్టెక్కించి. అప్పుడు క్రమంగా తన ప్రతిభను బైటపెడుతుంది. అంతకాలం చెట్టెక్కిన నీలాంటివాళ్ళు అప్పుడు షాక్ తింటారు. ఆ షాక్‌ని తట్టు

కోవడమే కష్టం. ఒకవేళ ఆ షాక్‌కు తట్టుకున్నా ఆ తర్వాతనుంచి అసలు యిబ్బంది ప్రారంభ మవుతుంది. ఆమె అప్పటికీ అవతలి వ్యక్తిని పొగడ్డం ఆపదు. ఆ పొగడ్తలు అవతలి వ్యక్తికి సంతోషం కలిగించవు. ఎదుటివాళ్ళు తననెంత పొగిడినా శ్యామల అంగీకరించదు. శ్యామలకెలా వుంటుందంటే యెదుటివాళ్ళు తనని ఓ స్తంభానిక్కట్టేసి- నోట్లో గుడ్డలు కుక్కి—చేతితో కొరడా ఝళిపిస్తూ—"నువ్వు అందమైనదానివి. నువ్వు తెలివైనదానివి. ఏ విద్యలోనూ నిన్నుమించిన వాళ్ళులేరు—" అని చెప్పి ఒప్పించాలని ఉంటుంది. అలా చేయాల్సిన అవసరం ఎదుటివాళ్ళకు కలిగిస్తుంది. అందరికీ అన్నీ రావు. ఎవరి బ్రతుకు వారిది. అలాంటప్పుడు మాటిమాటికీ శ్యామలతో పోల్చుకోవడం నీకూ, నీ భర్తకూ కూడా అలవాటు చేస్తోంది. అదెంత నరకమో అనుభవంలోకి వస్తేకానీ తెలియదు—" అంది రామావతి.

ఆలోచిస్తూ ఉంటే రామావతి చెప్పింది నిజమేనేమోననిపిస్తుంది. నేనెంత పొగిడినా శ్యామల ఒప్పుకోదు. కానీ తను నన్ను పొగుడుతుంది. నిజానికి చాలా విషయాల్లో ఆమె నాకంటె అధికురాలు. ఏదో ఒక రోజున ఆ విషయాన్ని నాకై నేను బలవంతాన ఆమెచేత ఒప్పించే పరిస్థితి ఏర్పడుతుంది. శ్యామలతో పోలిస్తే నేదు చాలా విషయాల్లో తీసికట్టు అని శ్రీవారే పరోక్షంగా సూచించారు. అంటే ఆయన ఆలోచనల్లో మమ్మల్నిద్దర్నీ పోల్చిచూడడం జరిగిందన్నమాట! అవును — శ్యామల నా కంటే వెయ్యిరెట్లు అందంగావుంటుంది. ఆమె నా అందాన్ని పొగిడితే అది నన్ను వేళాకోళం చేయడమవుతుంది కానీ పొగడ్త అవుతుందా?

"అయితే ఏంచేయాలంటావ్?" అనడిగాను.

"చాలా సింపుల్. ఈసారున్నుంచి ఆమె తను అందవికారిని—అంటే నువ్వు అయ్యో పాపం— అని జాలిపడు సరిగమలైనా రాపంటే—దానికేముంది—నేర్పుతాను అను. వంట రాదంటే— కొంతమందికి అంతే. ఎన్నేళ్ళు నేర్చుకున్నా రాదని ఓదార్చు. నిన్నేం పొగిడినా ఒప్పేసుకో. తనను తను చిన్నబుచ్చుకుంటే అంగీకరించు. తప్పితే— అయ్యో కాదని అనకు. ఆ తర్వాత ఆమె నీతో అట్టే మాట్లాడదు—"అంది రామావతి.

నేను ఆశ్చర్యంగా రామావతివంకచూస్తూ "నువ్వెలాగైనా చాలా తెలివైనదానివే" అన్నాను. అని....

వెంటనే రామావతితో — "ఇక్కణ్ణించి నువ్వేంచెబితే అది చేసి. నువ్వేం రాస్తే అది ఫాలో అవుతాను...." అన్నాను.

## నా తల్లి

పోకెట్ సైజు భగవద్గీత
గా
నా జేబులో ఇమిడిపోయిన
నా తల్లి భారతి




ఆ సేతు హిమాచల పర్యంతం
వ్యాపించి వున్నది
అన్నిభాషలూ మాట్లాడుతున్నది.

—రాయప్రోలు హైమవతి

